తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
బుధవారం
06 మే 2026
సంపుటి 03
సంచిక 208
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

# రైల్వేజోన్ ఏర్పాటుపై సీఎం చంద్రబాబు హర్షం

### చిరకాల స్వప్నం నెరవేరిందని ఎక్స్‌లో పోస్ట్



అమరావతి,మే5 (తరంగాలు ప్రతినిధి): విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ గెజిట్‌ను విడుదల చేయడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ రైల్వే జోన్ ఏర్పాటు ద్వారా ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందని తెలిపారు. మంగళవారం విశాఖపట్నం రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వ గెజిట్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. ఏపీ విజ్ఞప్తిని మన్నించి చరిత్రాత్మక గెజిట్‌ను విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలియ జేస్తున్నట్లు చెప్పారు. 2026, జూన్ 1వ తేదీ నుంచి విశాఖపట్నం కేంద్రంగా జోన్ అధికారిక కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని సీఎం చంద్రబాబు వివరించారు. వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస – ఇచ్ఛాపురం వంటి కీలక సెక్షన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం ద్వారా ఉత్తరాంధ్ర రవాణా రంగం ముఖచిత్రాన్ని మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పాటైన విశాఖపట్నం డివిజన్, రాయగడ డివిజన్‌ల మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఏపీ సీఎం ఆకాంక్షించారు. రాష్ట్రాభివృద్ధికి.. ప్రత్యేకించి ఉత్తరాంధ్ర పారిశ్రామిక వృద్ధికి ఈ రైల్వే జోన్ ఏర్పాటు దోహద పడుతుందని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఇదిలావుంటే విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు రాష్ట్ర ప్రగతిపై కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు అన్నారు. కొత్త రైల్వేజోన్‌తో రైళ్ల సంఖ్య పెరిగి కనెక్టివిటీ పెరుగుతుందన్నారు. రాయగడ డివిజన్ పరిధిలోకి కేకేలైన్ వెళ్లినా ఎలాంటి నష్టం ఉండదని తెలిపారు.

## రూ.5.11 లక్షల కోట్ల నాబార్డు రుణ ప్రణాళిక

2



## భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యం


### జలధార - జల హారతి కార్యక్రమంపై మంత్రి

నంద్యాల,మే5: రాష్ట్రంలో భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సూచనల మేరకు జలధార – జల హారతి కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పనిచేస్తోందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. హనుమంత గుండం చెరువు నుంచి దాదాపు 23 కిలోమీటర్లు కాలువ పొడవున ఉన్న 5 చెరువుల్లో, వాగులు, వంకల్లో మట్టి పూడికతీత పనులను సొంత నిధులతో చేపట్టామని అన్నారు. 3 మీటర్లలోపు భూగర్భ జలాలు వచ్చేలా కృషి చేస్తున్నామని మంత్రి చెప్పారు. భూగర్భ జలాలు పెరిగితే రైతులంతా తమ బోర్ల ద్వారా పంటలను సాగు చేసుకునే వీలుంటుందని బీసీ జనార్దన్ వెల్లడించారు. 23 కిలోమీటర్ల కాల్వ పొడవున జంగిల్ క్లియరెన్స్ పనులతో పాటు ఐదు చెరువుల్లో మట్టి పూడికతీత పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చెరువులు, కాలువల్లో పూడికతీత

మిగతా 2వ పేజిలో..

## బెంగాల్లో నేను ఓడిపోలేదు... రాజీనామా చేయను

- బిజెపి కుట్రలతో గెలిచింది.. తొత్తుగా మారిన ఎన్నికల సంఘం
- ప్రధాన విలన్ ఎన్నికల కమిషనర్ ..మమతా బెనర్జీ వ్యాఖ్యలు



కోల్‌కతా,మే5 (తరంగాలు ప్రతినిధి): పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బీజేపీ కుట్రలతోనే గెలిచిందని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. బీజేపీకి ఈసీ ఏజెంట్‌గా మారిందని ఆక్షేపణ తెలిపారు. ఈ ఎన్నికలో ప్రధాన విలన్ ఎన్నికల సంఘమేనని విమర్శలు గుప్పించారు. 100పైగా సీట్లు లూటీ చేశారని, తాను ఎన్నికల్లో ఓడిపోలేదని చెప్పారు. అందువల్ల తాను రాజీనామా చేసే ప్రసక్తి కూడా లేదన్నారు. లోక్‌భవన్‌కు వెళ్లనని, రాజీనామా చేయమని తనను ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి మీడియా సమావేశంలో మంగళవారంనాడు మమతాబెనర్జీ మాట్లాడుతూ..ఇసి, బిజెపిలపై ఘాటు విమర్శలు చేశారు. బిజెపి కనుసన్నల్లో ఇసి పనిచేసిందన్నారు. అమిత్ షా, ప్రధాని మోడీలు కలసి కటు÷–రలు చేశారని మండిపట్టారు. 'ఈ ఎన్నికల్లో విలన్‌గా ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహరించారు. బెంగాల్‌లో ఈవీఎంలను లూటీ చేశారు' అని

మిగతా 2వ పేజిలో..



## బెంగాల్, అసోంలలో ఓట్ చోరీ

- జనాదేశాశ్‌ను చోరీచేసిన బిజెపి
- మరోమారు రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ,మే5 బెంగాల్, అసోంలో ఓటు చోరీ జరగిందని విపక్షనేత రాహుల్ మరోమారు ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత

మిగతా 2వ పేజిలో..

## శాసనసభా పక్ష నేతగా విజయ్ ఎన్నిక

- ప్రభుత్వం ఏర్పాటుపై సమావేశంలో చర్చ
- మెజార్టీ కోసం గవర్నర్‌ను15 రోజులు గడువు కోరిన టివికె
- పొత్తు కోసం ఎవరినీ అడుక్కోబోమని స్పష్టీకరణ



చెన్నై,మే5 (తరంగాలు ప్రతినిధి): తమిళనాడులో అత్యధిక స్థానాలు సాధించిన టీవీకే పార్టీ మెజారిటీకి కొద్ది దూరంలో ఉంది. ఇదే సమయంలో పార్టీ లెజిస్లేటివ్ లీడర్‌గా విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ ప్రకటించింది. మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో విజయ్‌ను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఏర్పాటుపై కూడా చర్చించారు. ప్రభుత్వ ఏర్పాటుకు కొన్ని సీట్లు తక్కువగా ఉన్న అంశాన్ని నేతలు ప్రస్తావించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు మాట్లాడుతూ..

మిగతా 2వ పేజిలో..



## మక్కల కొనుగోళ్లలో కావాలనే జాప్యం

- రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం
- నేటిలోగా సమాధానం రాకపోతే ఆందోళన తీవ్రం
- ప్రభుత్వాన్ని హెచ్చరించిన కెటిఆర్

జనగామ,మే5 (తరంగాలు ప్రతినిధి): రాష్ట్రంలో సుమారు 14 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పండించారని, అయితే ఆ మేరకు కొనుగోలు ప్రణాళికలు రూపొందించలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించా...

మిగతా 2వ పేజిలో..

## దేశాభివృద్ధికి కీలక నిర్ణయాలు

- రూ. 1,52,702 కోట్ల నిధుల మంజూరు
- చెరుకు రైతుల కోసం లక్ష కోట్లు కేటాయింపు
- మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ' కింద రూ. 5,659 కోట్లు
- సెమీకండక్టర్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు
- ఉన్నత న్యాయస్థానంలో మరో నలుగురు జడ్జిల పెంపు
- కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు



మిగతా 2వ పేజిలో..

## మైనర్ల ట్రాప్ కేసులో సంచలన విషయాలు

- ఇన్‌స్టా వేదికగా వల విసిరి లోబర్చుకున్న బ్రదర్స్
- ఖరీదైన కార్లలో తిప్పుతూ అత్యాచారాలు
- కేసులో ఆజాద్ తల్లి, మేనమామల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన కమిషనర్ సజ్జన్నార్

హైదరాబాద్,మే5 జూబ్లీహిల్స్ బాలికల ట్రాప్, చీటింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ఇద్దరు అన్నదమ్ములు.. 19 మంది మైనర్లను ట్రాప్ చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను మీడియాకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించారు. నిందితులను విచారించామని.. ఈ విచారణలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌లో మూడుగంటల పాటు నిందితులను సీపీ ప్రశ్నించారు. అర్జున్ అలియాస్ చంద్రశేఖర్ ఆజాద్, ప్రవీణ్‌లను అరెస్ట్ చేసి కస్టడీకి తీసుకున్నట్లు చెప్పారు.రిచ్ కిడ్స్‌ను అర్జున్, ఆయన సోదరుడు ప్రవీణ్ టార్గెట్ చేశారని సజ్జనార్ వెల్లడించారు. మైనర్లను ట్రాప్ చేసి ఖరీదైన కార్లలోనే లైంగిక చర్యలకు అర్జున్ పాల్పడ్డాడని తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎస్మార్ట్‌గా ఉంటూ మైనర్లకు వల విసిరారని చెప్పారు. అర్జున్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో 150 మంది అమ్మాయిలు ఫాలో అవుతున్నారన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రస్తుతం అర్జున్ ప్రొఫైల్‌ను తాము లాక్ చేశామని తెలిపారు. ఇద్దరు నిందితులకు వారి తల్లి మీనాకుమారి కూడా సహకరించినట్లుగా గుర్తించామని అన్నారు. నిందితుల కుటుంబం గుంటూరుకు చెందినదిగా తమ దర్యాప్తులో తేలిందన్నారు. బాలికలు అట్రాక్ట్ అయ్యేలా ఇన్‌స్టాగ్రామ్‌లో అర్జున్ రీల్స్ చేశాడని అన్నారు. ఇక్కడి నుంచి

మిగతా 2వ పేజిలో..

జాతీయ దిన పత్రిక

తరంగాలు

THARANGALU DAILY NEWS

బుధవారం, 06 మే , 2026

GENERAL NEWS



## బెంగాల్లో నేను ఓడిపోలేదు...

# రాజీనామా చేయను

➢ మొదటి పేజీ తరువాయి

మమత ఆరోపించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు పోలింగ్ ముగిసిన తర్వాత కూడా 80 నుంచి 90 శాతం కంటే ఎక్కువ బ్యాటరీని కలిగి ఉండటం ఏమిటని ప్రశ్నించారు. పోలింగ్‌కు రెండ్రోజుల ముందే అధికారులు తమ పార్టీపై దాడులు, కార్యకర్తల అరెస్టులు చేశారని అన్నారు. భవనీపూర్‌లో ఉద్దేశపూర్వకంగానే ఒక ప్లాన్ ప్రకారం తనను ఓడించారని, ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగపరిచి బీజేపీ విజయం సాధించిందని, తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి ఎన్నికలు చూడలేదని అన్నారు. కౌంటింగ్ సెంటర్లలో టీఎంసీ కార్యకర్తలను కొట్టారని, తనను 'సీఆర్‌పీఎఫ్ గూండాలు' పొత్తికడుపులో తన్ని కౌంటింగ్ సెంటర్ నుంచి గెంటేశారని తీవ్రారోపణలు చేశారు. ఎస్ఐఆర్ నుంచి 90 లక్షల ఓట్లను తొలగించారనీ, కోర్టుకు వెళ్లడంతో 32 లక్షల ఓట్లు చేర్చారని, టీఎంసీని ఓడించేందుకు అన్నిరకాలుగా ఎత్తుగడలు పన్ని 100 సీట్ల వరకూ బీజేపీ లూటీ చేసిందని విమర్శించారు. ఈ మొత్తం ఉదంతంలో 'ఇండి' కూటమి తన వైపే ఉందని తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం సోనియాగాంధీ, రాహుల్ గాంధీ తనతో మాట్లాడారని, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్, హేమంత్ సోరెన్ తదితరులు ఫోను చేసి సపోర్ట్‌గా నిలిచారని చెప్పారు. 'ఇండి' కూటమిలోనే తాను కొనసాగుతానని కూడా స్పష్టం చేశారు.

# బెంగాల్, అసోంలలో ఓట్ చోరీ

రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఓటమి చెందడంతో కొందరు కాంగ్రెస్ నేతలు సంబరాలు చేసుకోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో జనాదేశాన్ని బీజేపీ చోరీచేసిందని ఆరోపించారు. ఇది కేవలం ఓ పార్టీ ఓటమి కాదని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను కూనీ చేసే ప్రమాదకర పరిణామం అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. సంకుచిత రాజకీయ ప్రయోజనా లను పక్కనపెట్టి.. దేశ ప్రజాస్వామ్య పరిరక్షణపై అన్ని పార్టీలు దృష్టి సారించాలని ఈ సందర్భంగా రాహుల్ పిలుపునిచ్చారు. 'ఇది ఒక పార్టీకి సంబంధించిన విషయం కాదు. దేశ అస్తిత్వానికి సంబంధించిన సమస్య' అని ఆయన పేర్కొన్నారు. విపక్ష పార్టీల మధ్య అనైక్యత పెరుగుతున్న నేపథ్యంలో.. అది బీజేపీకి వరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో చోటుచేసుకున్న పరిణామాలు దేశ ప్రజాస్వామ్య వినాశనానికి సంకేతాలుగా పరిగణించాల్సిన అవసరం ఉందని రాహుల్ హెచ్చరించారు. విపక్షాలు పరస్పర విభేదాలను తగ్గించి, ప్రజాస్వామ్య రక్షణ కోసం ఒకే వేదికపైకి రావాలని సూచించారు. దేశ భవిష్యత్తు దృష్ట్యా రాజకీయ పార్టీలన్నీ బాధ్యతతో వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అభిప్రాయపడ్డారు.

## శాసనసభా పక్ష

# నేతగా విజయ్ ఎన్నిక

రాజకీయపరంగా ఆత్మగౌరవం విషయంలో తమ పార్టీ రాజీపడబోదన్నారు. పొత్తు విషయంలోనూ తమ పార్టీ స్పష్టమైన వైఖరితో ఉందని ఆ పార్టీ నేతలు తెలిపారు. అధికారం చేపట్టేందుకు అవసరమైన మద్దతు కోసం తమ పార్టీ ఎవరినీ అడుక్కోబోదని తెలిపారు. ఇక, మెజారిటీ నిరూపించుకునేందుకు టీవీకే నేతలు గవర్నర్‌ను కలిసి 15 రోజుల సమయం కోరారు. 234 అసెంబ్లీ స్థానాలున్న తమిళనాడులో టీవీకే 108 సీట్లు సాధించి, అతిపెద్ద పార్టీగా మారింది. అధికారం చేపట్టాలంటే మరో 10 సీట్లు అవసరం. టీవీకేకు 35 శాతం ఓట్లు పోలయ్యాయి. మరోవైపు కాంగ్రెస్‌తో పొత్తు కోసం టీవీకే ప్రయత్నిస్తోందని ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు కాంగ్రెస్‌తో రాయబారం నడుస్తోందని తెలుస్తోంది. విజయ్ తండ్రి చంద్రశేఖర్ కూడా కాంగ్రెస్ పార్టీవైపు మొగ్గు చూపుతున్నారు. విజయ్ పార్టీ టీవీకే అధికారం చేపట్టాలంటే పొత్తు పెట్టుకోక తప్పని పరిస్థితి. విజయ్ ఎవరితో పొత్తువైపు మొగ్గు చూపుతారో తెలియాలి.

## ఒకే ఒక్క ఓటుతో మాజీమంత్రి ఓటమి

టివికె చేతిలో ఒక్క ఓటుతో ఓడిన పెరియకరుప్పన్

చెన్నై,మే5 తమిళ నాడు అసెంబ్లీ ఎన్ని కల్లో టీవీకే పార్టీ సృష్టి ంచిన ప్రభంజనంలో పలువురు చిత్తయ్యారు. విజయ్ నేతృత్వంలోని ఆ పార్టీ 108 సీట్లు సాధించి.. అత్యధిక స్థానాలు గెలిచిన పార్టీగా అవతరలించింది. డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు తర్వాత స్థానాల్లో నిలిచాయి. అయితే విజయ్ వేవ్‌లో డీఎంకే నేతలు చెల్లాచెదురయ్యారు. ఆ రాష్ట్ర సహకార శాఖ మాజీ మంత్రి కేఆర్ పెరియకరుప్పన్ అనూహ్య రీతిలో ఓటమిపాలయ్యారు. ఆయన కేవలఅం ఒకే ఒక్క ఓటు తేడాతో ఓటమి చెందారు. తిరుప్పత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తమిళగ వెట్రి కజగం పార్టీ నుంచి సీనివాస సేతుపథి పోటీ చేశారు. అయితే తాజా ఫలితాల్లో టీవీకే నేతకు 83, 375 ఓట్లు పోలయ్యాయి. ఇక రెండవ స్థానంలో పెరియకరుప్పన్‌కు 83,374 ఓట్లు పడ్డాయి. చాలా ఆసక్తికరంగా ఈ రేస్ కొనసాగింది. చివరి రౌండ్ వరకు పోటీ నువ్వానేనా అన్నట్లుగా సాగింది. చివరి రౌండ్ కన్నా ముందు రౌండ్‌లో 30 ఓట్ల ఆధిక్యంలో డీఎంకే నేత పెరియకరుప్పన్ ఉన్నారు. కానీ అనూహ్యమైన రీతిలో మాజీ మంత్రికి షాక్ తగిలింది. చివరి రౌండ్‌లో టీవీకే నేత సీనివాస సేతుపథ పుంజుకుని విజయాన్ని నమోదు చేశారు. పెరియకరుప్పన్ కన్నా ఒక్క ఓటు ఎక్కువ ఆర్జించారు. దీంతో టీవీకే నేత థ్రిల్లింగ్ విక్టరీ నమోదు చేశారు. తిరుప్పత్తూరు స్థానం నుంచి పోటీ చేసిన బీజేపీ నేత కేసీ తిరుమరన్ మూడవ స్థానంలో నిలిచారు. ఆయనకు 29,054 ఓట్లు పోలయ్యాయి.

## ఉపరితల ద్రోణితో పిడుగులతో కూడిన వర్షాలు

తెలుగు రాష్ట్రాలకు వర్ష హెచ్చరిక

విశాఖపట్టణం,మే5:తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణశాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రాబోయే మూడు రోజుల పాటు పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. తెలంగాణ, రాయలసీమ, తమిళనాడు మీదుగా కొమోరిన్ ప్రాంతం వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు. ఈ పరిస్థితుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశముందని అంచనా వేశారు. అదేవిధంగా తిరుపతి, చిత్తూరు, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు.

# హైదరాబాద్‌లో బీఏఎస్ఎఫ్ గ్లోబల్ సర్వీస్ హబ్

- తెలంగాణ ప్రభుత్వంతో కీలక ఒప్పందం
- సుమారు 3,000 మందికి కొత్త ఉద్యోగ అవకాశాలు
- ఐటీ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్,మే5 హైదరాబాద్‌లో జర్మనీకి చెందిన అంతర్జాతీయ దిగ్గజం బీఏఎస్ఎఫ్ గ్లోబల్ సర్వీస్ హబ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈమేరకు తెలంగాణ ప్రభుత్వానికి కీలక ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 3,000 మందికి కొత్త ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఐటీ మంత్రి శ్రీధర్ బాబుకు సంస్థ ప్రతినిధులు లెటర్ ఆఫ్ ఇంటెంట్ అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించనున్నట్లు ప్రకటించారు. ఈ హబ్ ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్సెస్ సేవలకు వ్యూహాత్మక కేంద్రంగా పని చేయనుంది. గ్లోబల్ సర్వీస్ డెలివరీ నెట్‌వర్క్‌కు హైదరాబాద్ కీలక కేంద్రంగా మారనుంది. 160 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ అంతర్జాతీయ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 200 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. హైదరాబాద్‌లో భారీ పెట్టుబడి ద్వారా తన సేవలను మరింత విస్తరించనుంది. తెలంగాణలో మరో మెగా గ్లోబల్ కంపెనీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడంపై ప్రభుత్వం సంతోషం వ్యక్తం చేసింది. హైదరాబాద్‌పై అంతర్జాతీయ కంపెనీల నమ్మకం మరింత పెరుగుతోందని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంగళవారం నాడు ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జర్మన్ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ ల సమక్షంలో బిఎఎస్ ఎఫ్ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ అధ్యక్షుడు టోబియాస్ డ్రాట్ తెలంగాణ లైఫ్‌సైన్సెస్ సీఈఓ సర్వేశ్ సింగ్ కు లెటర్ ఆఫ్ ఇంటెంట్ అందజేసారు. సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఊ ఏడాది 100 జిసిసిల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. వీటి ద్వారా లక్ష మంది ఐటి నిపుణులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. హైదరాబాద్ కేవలం కార్యాలయాల కేంద్రంగా మాత్రమే కాకుండా, ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ రంగాల్లో ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తున్నట్టు శ్రీధర్ బాబు తెలిపారు. ఇందులో భాగంగా కృత్రిమ మేథస్సు ఆధారిత కేంద్రం ఐకామ్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, 200 ఎకరాల్లో ఏఐ సిటీ, క్వాంటమ్ హబ్, జీవ విజ్ఞాన పరిశోధన్ సంస్థ '1 బయోల్యాబ్' లను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. 160 సంవత్సరాల చరిత్ర కలిగిన బిఎఎస్ ఎఫ్ ప్రపంచవ్యాప్తంగా 200కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 234 కర్మాగారాలు, 1,08,000 మంది ఉద్యోగులతో పనిచేస్తున్న ఈ సంస్థ వార్షిక ఆదాయం దాదాపు 5 లక్షల కోట్ల రూపాయలు (60 బిలియన్ డాలర్లు). ప్రపంచంలోని పలు నగరాలతో పోటీ పడి హైదరాబాద్ ఈ ప్రతిష్ఠాత్మక అవకాశాన్ని దక్కించుకోవడం రాష్ట్రానికి దక్కిన గౌరవం. న్విడియా, మైక్రోసాఫ్ట్, గూగుల్, వాన్‌గార్డ్, ఎలీ లిల్లీ, మారియట్ ఇంటర్నేషనల్ లాంటి దిగ్గజ సంస్థలు ఇక్కడ జిసిసిలు ఏర్పాటు చేసి హైదరాబాద్ నగరానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయని శ్రీధర్ బాబు తెలిపారు.

## రూ.5.11 లక్షల కోట్ల నాబార్డు రుణ ప్రణాళిక

- ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు

అమరావతి,మే5 నాబార్డు 2026-27 సంవత్సరానికి గాను రూ.5.11 లక్షల కోట్ల రుణ ప్రణాళికతో రూపొందించిన నాబార్డు క్రెడిట్ ప్లాన్‌ను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. రుణ ప్రణాళిక గతేడాది రూ.4.24 లక్షల కోట్లు ఉండగా... ఈ ఏడాది 20 శాతం పెంచి రూ.5,11,491 కోట్లతో ప్రాధమిక రంగానికి రుణ ప్రణాళిక ప్రకటించింది. సాగుకు మొత్తం రూ.2.55 లక్షల కోట్లు కేటాయించింది. ఇందులో పంట రుణాలు రూ.1.66 లక్షల కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.34,972 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.8,265 కోట్లు, ఫిషరీస్‌కు రూ.21,098 కోట్లు, హార్టికల్చర్‌కు రూ.11,961 కోట్లు కేటాయించింది. హార్టికల్చర్‌లో రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు రూ.5,313 కోట్లు కేటాయించారు. వ్యవసాయ మౌలిక సదుపాయాలకు రూ.9,957 కోట్లు, అనుబంధ కార్యకలాపాలకు రూ.12,687 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసింది. అలాగే ఎంఎస్‌ఎంఈ లకు రూ.1.64 లక్షల కోట్లు చొప్పున కేటాయించింది.

## పామర్రులో వివాహిత హత్య

- భర్త, అతని సోదరుల అరెస్ట్

విజయవాడ,మే5 కృష్ణా జిల్లా పామర్రులో చోటుచేసుకున్న వివాహిత హత్య కేసు నిందితులను పోలీసులు 24 గంటల్లో పట్టుకున్నారు. భర్త, అతడి సోదరులను అరెస్ట్ చేశారు. ఆ వివరాల్లోకి వెళితే.. నందివాడకు చెందిన మురళీకృష్ణకు 13 ఏళ్ల క్రితం లక్ష్మీ ప్రసన్నతో పెళ్లయింది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్తతో విభేదాల కారణంగా లక్ష్మీ ప్రసన్న 6 నెలల నుంచి దూరంగా ఉంటోంది. పామర్రులో ఇల్లు అదదెకు తీసుకుని నివసిస్తోంది. ఆదివారం భర్త మురళీ కృష్ణ, అతడి సోదరులు ఆమె దగ్గరకు వెళ్లారు. ఈ నేపథ్యంలోనే భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఆ గొడవ చిలికి, చిలికి గాలి వానలా మారింది. లక్ష్మీ ప్రసన్నపై భర్త, అతడి సోదరులు ఇనుప రాడ్డుతో దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ ఆమె అక్కడికక్కడే చనిపోయింది. ఆమె చనిపోయిందని ధ్రువీకరించుకున్నాక నిందితులు అక్కడినుంచి పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఇంటి దగ్గరకు వచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందం 24 గంటల్లోనే నిందితులను అదుపులోకి తీసుకుని, కోర్టుకు తరలించింది.

## భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యం

కార్యక్రమంలో భాగంగా మట్టిని.. అవసరమైన రైతులు తీసుకువెళ్లే విధంగా వెసులుబాటు కల్పించనున్నట్లు చెప్పారు. మట్టిని తీసుకెళ్లే రైతులను ఇబ్బంది పెట్టకుండా అధికారులకు ఆదేశాలు ఇస్తామన్నారు. కూటమి ప్రభుత్వం జలహారతి - జలధార కార్యక్రమాన్ని ఒక యజ్ఞం మాదిరిగా చేస్తోందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు

## మక్కల కొనుగోళ్లలో కావాలనే జాప్యం

కేవలం 10 లక్షల టన్నుల పంటను మాత్రమే కొనుగోలు చేయాలని భావిస్తోందని, మిగతా పంటను నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. పంటను కొనుగోలు చేయకుండా ఆలస్యం చేయడం వల్ల వర్షాల కారణంగా పంట దెబ్బతింటుందని, దీంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. కేటీఆర్ వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికాయి. అనంతరం జనగామ మండలంలోని యశ్వంతపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కేటీఆర్ సందర్శించారు. అక్కడ రైతులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతోందని రైతులు కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. 15 నుంచి 20 రోజులుగా ధాన్యం కొనుగోలు జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే స్పందించిన కేటీఆర్, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి, మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. అలాగే మార్క్‌ఫెడ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.22,000 కోట్ల అప్పులు తీసుకువచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాల కారణంగా అక్కడి నుంచి నిధులు రాకపోవడంతో, మార్క్‌ఫెడ్ నిధులను వాడుకుంటున్నారని చెప్పారు. తాను చెప్పిన లెక్కలు తప్పైతే ప్రభుత్వం రుజువు చేయాలని సవాల్ విసిరారు. రైతులను ఇలాగే ఇబ్బందులకు గురి చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని కేటీఆర్ హెచ్చరించారు.

# దేశాభివృద్ధికి కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ,మే5 దేశాభివృద్ధిని పరుగులు పెట్టించే దిశగా కేంద్ర క్యాబినెట్ ఇవాళ సంచలన నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో పలు కీలక ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు ఆమోదం తెలుపుతూ దాదాపు రూ. 1,52,702 కోట్ల నిధులను మంజూరు చేసింది. మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, సెమీకండక్టర్ రంగాలకు ఈ నిధులను కేటాయించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రం భారీ కేటాయింపులు చేసింది. చెరుకు రైతులకు తీపి కబురు అందించింది. 2026-27 సంవత్సరానికి గాను చెరుకు 'ఫెయిర్ అండ్ రెమ్యునరేటివ్ ప్రైస్' కోసం ఏకంగా రూ. 1 లక్ష కోట్లను కేటాయించింది. కాటన్ మిషన్.. పత్తి ఉత్పాదకతను పెంచేందుకు 'మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ' కింద రూ. 5,659 కోట్లు మంజూరు చేసింది. టెక్నాలజీ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు సెమీకండక్టర్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ప్రకటించింది. క్రిస్టల్ మ్యాట్రిక్స్ లిమిటెడ్.. సెమీకండక్టర్ యూనిట్ ఏర్పాటు కోసం ఈ సంస్థకు రూ. 3,068 కోట్లు కేటాయించారు. సుచి సెమికాన్ ప్రైవేట్ లిమిటెడ్.. మరో యూనిట్ కోసం రూ. 868 కోట్లు మంజూరు చేశారు. రైల్వే నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు మూడు కీలక మార్గాల్లో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. నగద - మథుర రైల్వే లైన్ నిర్మాణానికి రూ. 16,403 కోట్లు, గుంతకల్ - వాడి లైన్ నిర్మాణానికి రూ. 4,758 కోట్లు కేటాయించారు. ఇది తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు ఎంతో మేలు చేకూరుస్తుంది. బుర్హ్వాల్ - సీతాపూర్ రైల్వే లైన్‌కు రూ. 2,276 కోట్లు కేటాయించారు. వీటితోపాటు మరికొన్ని ఇతర కీలక నిర్ణయాలను కేంద్ర క్యాబినెట్ తీసుకుంది. ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారంటీ స్కీమ్ కోసం రూ. 18,100 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. షిప్పింగ్ రంగం.. వడినర్‌లో ఓడల మరమ్మత్తుల సౌకర్యాల అభివృద్ధికి రూ. 1,570 కోట్లు కేటాయించారు. సుప్రీంకోర్టు బలోపేతం.. అత్యున్నత న్యాయస్థానం పనితీరును మరింత మెరుగుపరచడానికి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ఒక కీలక విధాన నిర్ణయాన్ని క్యాబినెట్ ఆమోదించింది. దీంతోపాటు, సుప్రీంకోర్టులో మరో నలుగురు న్యాయమూర్తులను పెంచడానికి కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో దేశ అత్యున్నత న్యాయస్థానంలో జడ్జిల సంఖ్య 33 నుంచి 37కు చేరుతుంది. ఈ భారీ కేటాయింపులు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, భారీగా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తాయని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది.

## శిక్షణ, రుణం, మార్కెట్ సహాయంతో ప్రగతి దిశగా పయనం

- తొలి దశలో నందిగామ, తిరువూరు నియోజకవర్గాల్లో ఐఈడీపీ
- దశల వారీగా అన్ని మండలాల్లోనూ అమలుకు కసరత్తు

విజయవాడ,మే5 ఎస్సీ కుటుంబాల సమీకృత ఆర్థిక అభివృద్ధికి సమష్టిగా కృషిచేయడం జరుగుతోందని.. సమీకృత ఆర్థిక అభివృద్ధి కార్యక్రమం (ఐఈడీపీ) ద్వారా ముఖ్యంగా ఎస్సీ కుటుంబాల సమగ్ర ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఎన్ఎస్ఎఫ్‌డీసీ సీజీఎం సి.రమేష్ రావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య

సమావేశ మందిరంలో ఐఈడీపీపై జిల్లా అధికార యంత్రాంగం, నేషనల్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్ఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో భాగస్వామ్య పక్షాల సమావేశం జరిగింది. ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశతో పాటు ఎన్ఎస్ఎఫ్‌డీసీ చీఫ్ జనరల్ మేనేజర్ సి.రమేష్ రావు, డీజీఎం అమిత్ భాటియా తదితరులు హాజరైన ఈ సమావేశంలో ఎస్సీ కుటుంబాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అందుబాటులో ఉన్న పథకాలు, వాటిని సద్వినియోగం చేసుకునేలా అందించాల్సిన ప్రోత్సాహంపై చర్చించారు. స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీ-సూక్ష్మ రుణ సంస్థలు, సహకార సొసైటీలు, సహకార బ్యాంకుల ద్వారా అమలయ్యే పథకాలకు సంబంధించి ఎన్ఎస్ఎఫ్‌డీసీ అధికారులు వివరించారు. ఎన్ఎస్ఎఫ్‌డీసీ.. కేశినేని ఫౌండేషన్ భాగస్వామ్యంతో తొలిదశలో నందిగామ, తిరువూరు నియోజకవర్గాల్లో ఐఈడీపీ అమలు చేయనున్నట్లు తెలిపారు. తర్వాత జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, స్త్రీ నిధి, ఏపీఎస్ఎఫ్‌సీ, భాగస్వామ్య ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా రాయితీ రుణాలు అందించడం ద్వారా ఎస్సీ కుటుంబాలకు అవసరాల ఆధారంగా జీవనోపాధి కార్యక్రమాలను ప్రోత్సహించడం సమీకృత ఆర్థిక అభివృద్ధి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం మొదటి దశలో కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎన్ఐఆర్‌డీలో శిక్షణ పొందిన సుమారు 100 మంది ఎస్సీ మహిళలకు రుణ అనుసంధానం కల్పించడం జరుగుతుందన్నారు.

న్ఎస్ఎఫ్‌డీసీ సీజీఎం సి.రమేష్ రావు మాట్లాడుతూ.. ఇంకా ఐఈడీపీ మొత్తం వ్యయం రూ. 20 కోట్లు కాగా, సుమారు 2000 మంది ఎస్సీ లబ్ధిదారులకు యూనిట్‌కు సగటున రూ. లక్ష చొప్పున రుణం అందించబడుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఐఈడీపీ ద్వారా ప్రత్యేకంగా పారిశ్రామిక సామర్థ్యాభివృద్ధి, సంప్రదాయ కళాకారుల అభ్యున్నతి జీవనోపాధి కార్యక్రమం కింద బ్రాండ్ అభివృద్ధి, మార్కెటింగ్ సహాయం వంటి పలు చర్యలు ఉంటాయన్నారు. వీటికి అదనంగా సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఎగ్జిబిషన్లు/ప్రదర్శనల్లో లబ్ధిదారులు పాల్గొనడం కూడా ఇందులో భాగంగా ఉంటుందని వివరించారు. లెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ పశు సంవర్ధక, ఉద్యాన రంగాల్లో అభివృద్ధికి పుష్కల అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఈ రంగంలో ఏ2 మిల్క్, ది గోట్ ట్రస్ట్ ద్వారా వినూత్న ప్రాజెక్టుల అమలుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు.

# మైనర్ల ట్రాప్ కేసులో సంచలన విషయాలు

బాలికలను ట్రాప్ చేసి రిచ్‌గా కారులో షికారు అంటూ హైదరాబాద్ రోడ్లపై అర్జున్ అన్నదమ్ములు తిప్పారని చెప్పారు. తమతో ఫిజికల్ రిలేషన్ పెట్టుకునేలా బాలికలపై ఒత్తిడి చేశారన్నారు. ఆ వీడియోలను కూడా నిందితులు రికార్డు చేశారని.. సమయం చూసి తాము ఓ బిజినెస్ మొదలుపెడతామని బాధితులను నమ్మించి డబ్బు అడిగేవారని తెలిపారు. అలా ఓ బాలిక ఇంట్లో తెలియకుండా రూ. 13 లక్షలను నిందితులకు ఇచ్చిందన్నారు. గత ఏడాది కూడా ఇలాగే మరో మైనర్‌ను అర్జున్ ట్రాప్ చేశారని తెలిపారు. ఈ కేసులో మూడు రోజుల పాటు జైల్లో ఉండి ఆయన బయటకు వచ్చారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ఇకపోతే యువతులను బెదిరించి డబ్బులు కాజేసిన ఈ కేసులో మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఆజాద్ తల్లితోపాటు మేనమామను జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఖరీదైన కార్లలో తిరుగుతున్న ఫొటోలను ఇన్‌స్టాలో పోస్టు చేసిన ఆజాద్.. స్టార్టప్ కంపెనీ నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేసుకున్నాడు. యువతులకు దగ్గరై.. ఫొటోలు బహిర్గతం చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఓ మైనర్ బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో గత నెలలో ఆజాద్, అతడి సోదరుడిని పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు అనుమతితో నాలుగు రోజులు కస్టడీకి తీసుకొని విచారించారు. మోసపోయిన వారిలో ఎక్కువ మంది మైనర్లు ఉన్నట్లు గుర్తించారు. యువతుల నుంచి కాజేసిన సొమ్మును తల్లి, మేనమామ ఖాతాల్లో జమచేసినట్లు విచారణలో తేలింది. దీంతో తాజాగా వారిద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు.

THARANGALU DAILY NEWS
బుధవారం, 06 మే, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# దివంగత ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి కేటీఆర్ పరామర్శ





• బిఆర్ఎస్ పార్టీ తరఫున 5 లక్షల ఆర్థిక సాయం అందించిన

• రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ - కేటీఆర్

**తరంగాలు, మే :05, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**

నర్సంపేట నియోజకవర్గం దివంగత ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ నివాసానికి బి ఆర్ ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనా చారి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, మాజీ ఎంపీ మాలోతు కవిత తో కలిసి శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో ఆనాడు కెసిఆర్ ప్రభుత్వంలో కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లను క్యాబినెట్ లో చర్చించి అనంతరం వారిని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ ఆ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేశామన్నారు. కానీ దురదృష్టవశాత్తు సంస్థ విలీనాన్ని క్యాబినెట్ ఆమోదించిన వెంటనే ఎన్నికలు రావడం, ఆ తర్వాత మేము ఓడిపోవడం, అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా స్పష్టమైన హామీ ఇచ్చింది వెంటనే ఆర్టీసీని విలీనం చేయడంతో పాటు కార్మికులకు న్యాయం చేసే విధంగా పి ఆర్ సి ఇవ్వడం, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన తర్వాత వచ్చే అన్ని హక్కులు కల్పిస్తామని వాగ్దానం చేసింది. కానీ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా, 100 రోజుల్లో చేస్తామని చెప్పినా పనిని చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు ఆ సమ్మె సమయంలో నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టాలని కోరుతూ ఆత్మహత్యకి పాల్పడ్డారని అన్నారు. దురదృష్టవశాత్తు శంకర్ గౌడ్ మరణించిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మా నాయకులు నర్సంపేటకు వచ్చి ఆ కుటుంబానికి అండగా నిలబడాలని ప్రయత్నిస్తే మమ్మల్ని ఎక్కడికక్కడ అరెస్టులు, మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ని అయితే అంత్యక్రియల రోజున 12 పోలీస్ స్టేషన్ లకు తిప్పి చివరకు ఖమ్మం జిల్లాలో తీసుకెళ్లి నిర్బంధించడం జరిగిందన్నారు. ఇక్కడ కనీసం ఆ కుటుంబానికి న్యాయం చేస్తారా అంటే ఈరోజు మేము వస్తున్నామని తెలిసి ప్రభుత్వం ప్రకటించిన 10 లక్షల రూపాయలు కూడా ఇన్ని రోజుల తర్వాత గుర్తొచ్చి ఇచ్చారన్నారు. మేము కూడా పార్టీ తరపున ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి అండగా ఉంటాం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ కార్మికులకు కూడా తప్పకుండా మద్దతుగా నిలుస్తామన్నారు. మా ప్రభుత్వంలోనే మిమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన ప్రభుత్వం కెసిఆర్ ప్రభుత్వం కానీ మా ప్రభుత్వం మారడంతో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. మీరు దయచేసి ధైర్యం కోల్పోకుండా అందరం కలిసికట్టుగా పోరాడుదాం మీకు న్యాయం జరిగే వరకూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకునే వరకు మీ తరపున మేము గొంతు విప్పుతూనే ఉంటాం మీతో కలిసి నడుస్తాం అయితే శంకర్ గౌడ్ లాగా ప్రాణ త్యాగాలు ఎవరు చేయవద్దని మీ కుటుంబాలకు దుఃఖం మిగలచవద్దని మనవి చేశారు. ఇలాంటి సమయంలో రాజకీయాలు పక్కన పెట్టి అందరం కలిసి వారి కుటుంబానికి అలాగే ఆర్టీసీ కార్మికులకు అండగా నిలుద్దామని అన్నారు.



# కాకతీయుల నాటి శివాలయం కులకొట్టిన కాంట్రాక్టర్ల్

• గుడి బడికి అడ్డమా
• పట్టించుకొని దేవాదాయ శాఖ అధికారులు
• అశోక్ నగర్ గ్రామ ప్రజల ఆగ్రహం







**నర్సంపేట మే 05, తరంగాలు,**

నర్సంపేట నియోజకవర్గంలోని ఖానాపూర్ మండలం పాకాల అశోక్ నగర్ గ్రామం కాకతీయ చరిత్ర కలిగిన గ్రామం. గణపతి దేవుడు పదమూడో శతాబ్దంలో శివాలయాన్ని నిర్మించాడు అని,శివాలయం చుట్టూ మట్టి కోట నిర్మించిన కాకతీయులు కోటకు ఉత్తర-దక్షిణమున రెండు ద్వారాలు, కోటకు నాలుగు దిక్కున బురుజులు పహారా కోసం కోట చుట్టూ మోటు ఎవరు ప్రవేశించకుండా శత్రు దుర్భేధ్యమైన కోటను నిర్మించి సైనిక స్థావరంగా ఉపయోగించారు అన్ని గ్రామ పెద్దలు చెప్పేవారు. ఇంతటి ఘనమైన చారిత్రక నేపథ్యం ఉన్న కోటను తవ్వడం, కాకతీయులనాటి శివాలయాన్ని కూల్చటం వారసత్వ చట్టాలకు విరుద్ధం. మన పూర్వీకులు మనకు అందించిన వారసత్వ చరిత్రను భవిష్యత్ తరాలకు అందించవలసిన పురాతన శాఖ అధికారులు పాఠశాల పేరుతో నాశనం చేయడం విడ్డూరం అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు ఎనిమిది వందల సంవత్సరాల చరిత్ర గల అశోక్ నగర్ గ్రామానికి ఉన్న ఏకైక ఆధారాన్ని చెరిపేయడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైతే ఈ ఆలయాన్ని కూల్చారో వారే తిరిగి యధాస్థానంలో పునర్నిర్మించాలి. కోటను ఆలయాన్ని కాపాడి భవిష్యత్ తరాలకు అందించాలి, ఇప్పటికైనా పురాతన శాఖ అధికారులు, ప్రభుత్వం జోక్యం చేసుకొని శివాలయాన్ని పునర్నిర్మించాలని గ్రామ ప్రజలు కోరారు.

# మంత్రి కొండా సురేఖని వెంటనే పదవి నుంచి తొలగించాలి

• హిందూ భావాలను అవమానించడం బాధాకరం
• బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు



వరంగల్ ప్రతినిధి, మే 5,తరంగాలు : మంత్రి కొండ సురేఖ "జై శ్రీరామ్ అంటే డబ్బులు పడతాయా?" అంటూ చేసిన వ్యాఖ్యలను బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూనువ్వు తిరుపతికి వెళ్తున్నావు, దేశంలోని అనేక దేవాలయాలకు వెళ్తున్నావు...నీకు పైసలు ఇస్తేనే వెళ్తున్నావా?" అని ప్రశ్నించారు.ఒక దేవదాయ శాఖ మంత్రిగా ఉండి, హిందూ దేవతలపై, విశ్వాసాలపై ఈ విధంగా వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం?" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.జై శ్రీరామ్ అనేది కోట్లాది హిందువుల ఆస్తిక భావన.దానిని అవమానించడం అత్యంత బాధాకరం అని అన్నారు.ఇలాంటి బాధ్యతారహిత వ్యాఖ్యలు చేసిన మంత్రి ప్రజల విశ్వాసాలను దెబ్బతీశారని,అమెను తక్షణమే మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

# బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా-రాస్తారోకో





• పాల్గొన్న రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ

**వర్ధన్నపేట ప్రతినిధి, మే 05,తరంగాలు :**

ఇల్లంద వ్యవసాయ మార్కెట్ ముందు వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై బిజెపి శ్రేణులు ధర్నా చేపట్టారు. ధర్నా-రాస్తారోకో వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల కేంద్రంలోని ఇల్లంద గ్రామ వ్యవసాయ మార్కెట్ వద్ద బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన ధర్నా - రాస్తా రోకో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు బస్వపురం లక్ష్మి నరసయ్య,వరంగల్ జిల్లా ఇంచార్జి కొండపల్లి శ్రీధర్ రెడ్డి, తో పాటు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతు దేశానికి వెన్ను ముఖ రైతు, రైతే రాజు అలాంటిది, ఆ రైతు పండించిన ధాన్యం మరియు మక్కలు ఎందుకు కొనుగులు చెయ్యడం లేదు ?
ఆలస్యం ఎందుకు జరుగుతుందని ప్రశ్నించారు ?
రాష్ట్రంలో వరి ధాన్యం, మరియు మక్కజొన్నలు కొనుగోలు కేంద్రాలలో రైతులు ఇబ్బందులు పడుతుంటే ఈ ప్రభుత్వం ఎందుకు పాటించుకోవడం లేదు అని,
తక్షణమే కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న సమస్యలు వెలికి తీసి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని బీజేపీ పార్టీ తరుపున వారు అన్నారు.
రైతుల బాధలు తీర్చలేని ఈ ప్రభుత్వం సిగ్గుచేటు అని మండిపడ్డారు.ఈ ధర్నా కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతి రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలగం రంజిత్, సిద్ధం నరేష్ పటేల్ , నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శి రాయపురం కుమారస్వామి, సర్పంచ్ రాయపురం రమ్య,రాష్ట్ర మహిళ మోర్చా ఉపాధ్యక్షులు మంజుల రెడ్డి , నర్సంపేట ఎమ్మెల్యే కాంటెస్టెడ్ ఖంభంపాటి పుల్లారావు, పర్వతగిరి మండల అధ్యక్షులు హార్కవత్ వినోద్ , మాజీ మండల అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్, మండల అధ్యక్షులు ఆడుపా రాజు, కొండేటి సత్యం, రామ్ రెడ్డి, మహేందర్ రెడ్డి , శ్రీధర్, వార్డు సభ్యులు,ఉపసర్పంచ్, జిల్లా నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ధర్నా లో పాల్గొన్నారు.



# జి.వి.ఎస్ ఆంజనేయులు భౌతిక దేహానికి ఈగ మల్లేశం నివాళి



**వరంగల్ ప్రతినిధి, మే 5,తరంగాలు**

:జి.వి.ఎస్ ఆంజనేయులు భౌతిక దేహానికి కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం నివాళులర్పించారు.వరంగల్ నగరం వేణురావు కాలనీ కి చెందిన అఖిల భారత బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షులు మరియు శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ సభ్యులు జివిల్ శ్రీధర్ తండ్రి జి.వి.ఎస్ ఆంజనేయులు అనారోగ్యంతో మృతి చెందాడు.వార్త తెలుసుకున్న కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం వారి స్వగృహానికి వెళ్లి జి.వి.ఎస్ ఆంజనేయులు భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ మాజీ మేయర్ కక్కే సారయ్య, నరేందర్, హరి కృష్ణ, రమేష్, సుధాకర్, దయాకర్, దేవేందర్ రాజు, శ్రీధర్, సుభాష్,గణేష్ తదితరులు పాల్గొన్నారు



## పీఏసీఎస్ చైర్మన్ గా తీగల కరుణాకర్ రావు

- ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జఫర్గడ్ పాక్స్ చైర్మన్ గా బాధ్యతల స్వీకరణ



**జఫర్గడ్ ప్రతినిధి, మే 5,(తరంగాలు):** పాక్స్ చైర్మన్ గా తీగల కరుణాకర్ రావు ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జఫర్గడ్ పీఏసీఎస్ నుండి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేస్తూ రైతులకు సకాలంలో ఋణాలు అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. రైతులకు సేవ చేయడం ఎంతో అదృష్టం అని వారికి ఎలాంటి కష్టాలు ఎదురు కాకుండా ఎమ్మెల్యే శ్రకడియం శ్రీహరి సహకారంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందని పేర్కొన్నారు.సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తూ సొసైటీని మొదటి స్థానంలో ఉంచడానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు సిబ్బంది మరియు అభిమానులు చైర్మన్ ను బోకే,శాలువాతో అభినందిస్తూ సన్మానించారు.కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ డైరెక్టర్లు వివిధ గ్రామాల సర్పంచులు, మండల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీల కొరతపై జిల్లా వ్యాప్తంగా రైతులు ఎక్కడిక్కడ రహదారులు దిగ్బంధనం చేయాలి

- జిల్లా కలెక్టర్ సివిల్ సప్లై అధికారుల నిర్లక్ష్య వైఖరి నశించాలి
- లారీ కాంట్రాక్టర్ తో లాలూచీ పడుతున్న సివిల్ సప్లై అధికారులు



**జఫర్గడ్ ప్రతినిధి, మే 5,(తరంగాలు ):**
జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీల కొరతపై జిల్లా వ్యాప్తంగా రైతుల ఎక్కడికక్కడ రహదారులు దిగ్బంధనం చేయాలని జిల్లా కలెక్టర్ సీల్ సప్లై అధికారుల నిర్లక్ష్యం నశించాలని లారీ కాంట్రాక్టర్ తో లాల్చబడుతున్న సివిల్ సప్లై అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ పార్టీ మండల కార్యదర్శి జువారి రమేష్ అన్నారు. మంగళవారం రోజున మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ను భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆధ్వర్యంలో సందర్శించారు ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఐకేపీ పిఏసియస్ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి 20 రోజులు గడుస్తున్నప్పటికీ జిల్లా సహకార శాఖ అధికారి ఆదేశాల మేరకు కొనుగోలు చేయడం లేదని అదే విధంగా ఇట్టి సెంటర్ కు జియో టాకింగ్, మిల్లు మరియు గోధములు ట్యాగ్ చేయకపోవడం వల్ల కాంటాలు వేసి నెల రోజులు అవుతున్నప్పటికీ ధాన్యం మిల్లులకు తరలించడం లేదని అన్నారు. దఇట్టి సెంటరు నిర్వాహన విషయంలోఎపియం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని ఆయన అన్నారు.అధికారులు కావాలనే ఉద్దేశపూర్వకంగా రైతులను ఇబ్బందుల గురి చేస్తున్నారు. గత నెల రోజుల నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి మాయిచ్చర్ వచ్చి ఉన్నప్పటికిని లారీలు రావడంలేదని ఇట్టి విషయంలో అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకపోవడం తీవ్ర నిరాశకు రైతాంగం గురవుతున్నారని కాబట్టి ఆన్లైన్ విధానాన్ని రద్దు చేయాలని గత సంవత్సరం మాదిరిగానే నిర్వహించాలని జిల్లావ్యాప్తంగా లారీలు రానట్లయితే రైతుల ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలించడానికి అవకాశం ఇవ్వాలని ఎందుకంటే వానకాలం సమీపిస్తున్నందున వర్షాలు పడితే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంటుందని కాబట్టి జిల్లా కలెక్టర్ పునరు ఆలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షులు ఎండీ యాకుబ్ పాషా,సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు వడ్లకొండ సుధాకర్, నాయకులు వేల్పుల పెద్దరాములు,మంద బుచ్చయ్య, అన్నెపు అజయ్,చిలివేరు ఎల్లయ్య, అన్నెపు విష్ణు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక వ్యవసాయ శాఖ రైతు వేదిక స్థాయి కార్యక్రమం

**ఇల్లందు ప్రతినిధి మే 5, ( తరంగాలు):** ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా రేపల్లెవాడ, కొమరారం, సుదిమళ్ళ రైతు వేదికలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో. నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం తో పాటు వినియోగదారులు కోరుకునే సన్న వరిరకాల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రైతులు రైతువేదిక నందు హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.ఇట్టి కార్యక్రమానికి రేపల్లెవాడ నుండి ఎంఈఓ సతీష్ , తహసీల్దార్, రేపల్లెవాడ సర్పచ్ శారదా, సుదిమళ్ళ నుండి ఏడిఏ లాల్చంద్, ఏఈఓఎస్ సందీప్, సుమన్, యశ్వంత్ పాల్గొన్నారు.




## వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం




**ఇల్లందు ప్రతినిధి మే 5,( తరంగాలు ):** ఇల్లందు మండలం సుదిమళ్ళ రైతు వేదికలో ఉద్యానవన పంటల సాగు, ఆయిల్ పామ్ పంట విస్తీర్ణం పెంపుదల, ప్రత్యామ్నాయ పంటల సాగు మీద నియోజకవర్గస్థాయి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి. బాబురావు మాట్లాడుతూ, అత్యధికంగా వంట నూనె దిగుబడి నిచ్చే పంటల్లో ఆయిల్ పామ్ పంట చాలా ప్రధానమైనదని, ఒక ఎకరం వరి సాగుతూ అవసరమయ్యే నీటితో మూడు ఎకరాల ఆయిల్ ఫామ్ పంట చేపట్టవచ్చు అని చెప్పడం జరిగింది. ఇల్లందు మండలంలో ప్రధానంగా పండించే మొక్క జొన్న పంటకు బదులుగా ప్రతి ఒక్క రైతు కూడా ఈ ఆయిల్ పామ్ పంట వైపు మల్లాలని, పంట మార్పిడి చేయాలని సూచించారు. ఆయిల్ పామ్ పంటకు ఒక ఎకరాకు 57 మొక్కలు అవసరమవుతాయి, 60 సెంటీమీటర్ల పొడవు, 60 సెంటీమీటర్ల వెడల్పు, 60 సెంటీమీటర్ల లోతు పరిమాణంతో గుంతలు తీసి మొక్కలు నాటుకోవచ్చని తెలిపారు. దీనికిగాను మొక్కల మెయింటినెన్స్ కి, అంతర్ పంటలకి ఎకరానికి 4200/- రూపాయలు చొప్పున రైతు యొక్క ఖాతాలో జమ చేయబడుతుంది అని తెలిపారు. దిగుబడి విషయానికొస్తే ఎకరానికి సరాసరి 8-10 టన్నుల గెలల ఉత్పత్తిని సాధించవచ్చు అని ఒకటన్ను సుమారు 23,500/- ఉంటదని నేరుగా గవర్నమెంట్ వారే వచ్చి కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయిల్ ఫామ్ రైతుల విజయ గాథను కూడా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి. బాబురావు , ఇల్లందు మార్కెట్ యార్డ్ చైర్మన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దొడ్డ డేనియల్ మిత్రా , సహాయ వ్యవసాయ సంచాలకుల జీ. లాల్చంద్, మండల వ్యవసాయ అధికారి పీ. సతీష్ , టేకులపల్లి మండల వ్యవసాయ అధికారి ఎన్. అన్నపూర్ణ ,ఇల్లందు మండలం ఎంపీడీవో కే, దన్సింగ్, హార్టికల్చర్ ఆఫీసర్ స్రవంతి , ఆత్మ కమిటీ చైర్మన్ బోడా మంగీలాల్, ఇల్లందు, టేకులపల్లి వ్యవసాయ విస్తరణ అధికారులు, ఆత్మ స్టాఫ్, గోద్రెజ్, ఆయిల్ ఫీడ్ కంపెనీ వారు, ఇల్లెందు, టేకులపల్లి రైతులు, ఉత్తమ రైతులు పాల్గొనడం జరిగింది.

## శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్ గ్రేషియా 10 లక్షల రూపాయల చెక్ అందజేత



**తరంగాలు, మే:05, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**
నర్సంపేట నియోజకవర్గం ఇటీవల జరిగిన ఆర్టీసీ సమ్మెలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్న నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ కోల శంకర్ గౌడ్ కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున 10 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించగా స్థానిక శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి సహకారంతో బాధిత కుటుంబానికి ఎక్స్ గ్రేషియా చెక్ ఆర్డిఓ ఉమారాణి, మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్, ఎమ్మార్వో, మున్సిపల్ కమిషనర్, వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా లు శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. అదేవిధంగా శంకర్ గౌడ్ కుమారుడు కోల హేమంత్ కు ఉద్యోగం ఇచ్చేందుకు ఆర్టీసీ ఎండి తో మాట్లాడడం జరిగిందని ప్రభుత్వాన్ని లేక ద్వారా కోరడం జరిగిందని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. అతి త్వరలో శంకర్ గౌడ్ కుమారుడు హేమంత్ కు కార్పొరేషన్ లో ఉద్యోగం ఇప్పించడం జరుగుతుందని అన్నారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య స్థానిక వార్డ్ కౌన్సిలర్ కాంపెల్లి వీణ, పొన్నాల మనీషా, ఎన్ ఎస్ యు ఐ టౌన్ అధ్యక్షులు కటారి ఉత్తంకుమార్, సోషల్ మీడియా ఇన్చార్జ్ దేవోజు హేమంత్ పాల్గొన్నారు.

## ఇల్లందు లో హిందూ సమ్మేళనం




**ఇల్లందు ప్రతినిధి మే 5, ( తరంగాలు):** ఇల్లందు పట్టణ జె కె సింగరేణి గ్రౌండ్ లో హిందూ సమ్మేళనం కార్యక్రమంలో ప్రసంగించిన అఖిల భారత నామ్ దారి అఖాడా మండలేశ్వర్ శ్రీ శివనాగస్వామి,విజ్ఞానందభారతి వీరభద్రం గురూజీ లు మాట్లాడుతూ,హిందూ ధర్మాన్ని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అది అందరినీ కాపాడుతుందని ఉపదేశించారు.ప్రతి తల్లి తన పిల్లలకు మన సంస్కృతి,ధర్మం నేర్పాలని అప్పుడే ఈ దేశం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. హిందువుల ఐక్యతే ఈ దేశానికి,సమాజానికి శ్రీ రామరక్ష అని సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఉత్సవ సమితి అధ్యక్షులు పులిగల్ల మాధవరావు అధ్యక్షత వహించారు.



## అరుణోదయ రామారావు ఆశయ సాధనం కోసం కృషి చేస్తాం



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి, మే. 05, తరంగాలు:** అరుణోదయ రామారావు అమరత్వ స్ఫూర్తితో, సామాజిక మార్పు కోసం, రామారావు ఆశయ సాధన కోసం కృషి చేస్తామని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా నాయకులుబట్టు నాగేశ్వరరావు,తెలిపారు.రామారావు 7వ వర్ధంతి సందర్భంగా కేసముద్రం మార్కెటింగ్ యార్డ్ లో అరుణోదయ ఆధ్వర్యంలో కామ్రేడ్ రామారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యర జిల్లా నాయకులు బట్టు నాగేశ్వరరావు మాట్లాడుతూ... రాళ్లను కరిగించే రాగం తీసి రాజ్యాన్ని కబళించే గానం చేసి బతకంతా పాటతో పయనం చేసిన వర్గ పోరాటాన్ని మదినిండా తలచి పచ్చని అడివమ్మ గాయాలను, నెత్తురు పోసిన యాగాలను గానం చేసిన రామారావు అన్నకు జోహార్లు తెలియజేశారు.సందర్భంగా జరిగిన సభకు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి కేసముద్రం సబ్ డివిజన్ నాయకులు బట్ట మేకల రాజు అధ్యక్షతన నాయకులు బొమ్మగాని వెంకన్న,మాట్లాడుతూ ప్రజల కష్టాల నుండి పురుడు పోసుకున్న ప్రజా కళలు, శ్రమ దోపిడీ లేని సమాజం కోసం సాధనంగా ఉంటామని ఆయన అన్నారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజా కళాకారుల గొంతుకలను నొక్కుతూ నిర్బంధిస్తుందని, ఆయన తెలిపారు. నరేంద్ర మోడీ గారు ఎన్నికల వాగ్దానాలు విస్మరించారని, ఏటా రెండు కోట్ల కొలువులు, బ్లాక్ మనీ వెలికి తీసి జందన్ ఖాతాలో 15 లక్షల రూపాయల జామ, బేటి బచావో బేటి పడావో, ప్రభుత్వ రంగ సంస్థల, రైతు సంక్షేమం అనేక వాగ్దానాలు నీటిమూటలుగా మారాయని ఆయన అన్నారు.రాజ్యాంగంలోని లౌకిక విధానాలను, ప్రజాస్వామ్యవిలువలను మోడీ సర్కార్ పాతర వేస్తుందని, ప్రశ్నించే గొంతులను నిర్బంధిస్తుందని ఆయన అన్నారు. కళ కళకోసం కాదు ప్రజల కోసం అని మహత్తర లక్ష్యం కోసం రామారావు తమ జీవితాన్ని ప్రజా జీవితంగా మలుచుకున్నారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టీ యు నాయకులుకాసు సూరయ్య, శ్రీనివాస్ రెడ్డి, చిట్లా సంజీవ, ఆదినారాయణ, లింగయ్య, కోడి పర్వతాలుతదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్, పదో ఫెయిల్ విద్యార్థులకు ప్రత్యేక క్యాంపులు - 100% ఫలితాలే లక్ష్యం

**కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ మే 5**
జిల్లాలో ఇంటర్మీడియట్ మరియు పదోతరగతి పరీక్షల్లో విఫలమైన విద్యార్థుల కోసం ప్రత్యేక సప్లమెంటరీ క్యాంపులను సమర్థవంతంగా నిర్వహించి 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మంగళవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు, ఇంటర్మీడియట్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలాల వారీగా ఫెయిల్ అయిన విద్యార్థుల పూర్తి వివరాలను సేకరించి, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా భద్రాచలం, పాల్వంచ, చంద్రుగొండ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సప్లమెంటరీ క్యాంపుల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మే 13 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారికి బలహీనమైన అంశాల్లో పటిష్టమైన శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ప్రతి విద్యార్థి అభ్యాస పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని స్పష్టం చేశారు.అలాగే పదోతరగతి ఫెయిల్ విద్యార్థుల కోసం సమ్మర్ క్యాంపులు నిర్వహించి, వారి లోపాలను గుర్తించి లక్ష్యబద్ధంగా బోధన చేపట్టాలని ఆదేశించారు. మండలాలు, పాఠశాలల వారీగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి అమలు చేయాలని సూచించారు.జిల్లాలోని పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించిన కలెక్టర్, పాఠశాలల పునఃప్రారంభానికి ముందే అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుదీకరణ వంటి సదుపాయాలు 100 శాతం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని చెప్పారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 12 నుంచి చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, ఉత్తీర్ణత శాతాన్ని పెంచడం కోసం సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.